# సాక్షి అనంతపురం

సోమవారం । 3 । మార్చి । 2025







**టమాట కిలో రూ.9**

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.9 పలికింది. కనిష్టం రూ.5, సరాసరి ధర రూ.7 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



**విద్యుత్ శాఖలో డిప్యుటేషన్ల లీల**

విద్యుత్ శాఖ అధికార యంత్రాంగం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోంది. అనధికారికంగా అనుకూలమైన ఉద్యోగులను నగరంలో తీసుకువచ్చేస్తున్నారు. 8లో




## న్యూస్‌రీల్

### నేడు కలెక్టరేట్‌లోనే గ్రీవెన్స్

**అనంతపురం అర్బన్:** ప్రజాసమస్యల పరిష్కార వేదిక (ఫిర్యాదుల స్వీకరణ) కార్యక్రమం సోమవారం కలెక్టరేట్‌లోనే నిర్వహించనున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా ప్రకటించిన విధంగా రాప్తాడు నియోజకవర్గ కేంద్రంలో రద్దు చేశామని పేర్కొన్నారు. ఎప్పటిలాగానే కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో కార్యక్రమం ఉంటుందని, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

### ఆరోపణల అధికారికి అందలం?

- గుత్తి డీవైఈఓ సీటులో కూర్చోబెట్టేందుకు పావులు

**అనంతపురం ఎడ్యుకేషన్:** విద్యాశాఖలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారికి అందలం ఎక్కించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఫిబ్రవరి 28న గుత్తి డీవైఈఓ రిటైరయ్యారు. పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిని ఆ పోస్టులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. విద్యాశాఖలో కీలకమైన పోస్టులో పని చేసిన ఆయన పూర్వపు డీఈఓ వరలక్ష్మి ఇక్కడ జాయిన్‌కాకముందే ఆమె పేరుతో ప్రశ్నపత్రాల ముద్రణ పేరిట నిధులు డ్రా చేశారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. దీనిపై రాష్ట్ర అధికారులు దృష్టి సారించారు. ప్రాథమిక విద్య ఆర్జేడీ ప్రత్యేక బృందంతో విచారణ జరిపించారు. విచారణ అనంతరం ఇచ్చిన నివేదిక ఆధారంగా ఆయనను ఆ సీటు నుంచి తప్పించారు. సదరు అధికారి హయాంలోనే అలసత్వం కారణంగా నేషనల్ అసెస్‌మెంట్ సర్వే నిర్వహణ నిధులు దాదాపు రూ. 20 లక్షలకు పైగా వెనక్కుపోయాయి. వేళకు బిల్లులు పెట్టకపోవడం, సంబంధిత అధికారులతో అప్రూవల్ చేయించడంలో అలసత్వమే కొంప ముంచింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ ఈ నిధులు డ్రా చేసుకున్నారు. ఇక్కడ మాత్రం వెనక్కుపోయిన నిధులు నేటికీ రాలేదు.

**పావులు కదుపుతున్న అధికారి..**

అవినీతి ఆరోపణలతో పాటు విధుల పట్ల తీవ్ర అలసత్వం ప్రదర్శించే సదరు అధికారిని గుత్తి డీవైఈఓ పోస్టులో కూర్చోబెట్టేందుకు విద్యాశాఖలోని ఓ అధికారి పావులు కదుపుతున్నారు. సీనియార్టీ వరుసలో ముందుగా ఉన్నారనే కారణంగా ఆయనను కీలకమైన డీవైఈఓ పోస్టులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారికి వంత పాడుతున్న వైనాన్ని చూసి డీఈఓ కార్యాలయ సిబ్బంది, పలువురు ఎంఈఓలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఈ మొత్తం వ్యవహారాన్ని ఇప్పటికే కొందరు ఉపాధ్యాయ సంఘాల నాయకులు విద్యాశాఖ కమిషనర్, ఆర్జేడీ దృష్టికి తీసుకెళ్లారు. మరి ఉన్నతాధికారులు ఏ నిర్ణయం తీసుకుంటారనేది ఆసక్తిగా మారింది.

### పట్టు చీరల డిజైనర్‌కు రాష్ట్రపతి భవన్ నుంచి ఆహ్వానం



నాగరాజు

**ధర్మవరం:** రాష్ట్రపతి భవన్ నుంచి ధర్మవరం పట్టుచీరల డిజైనర్ జుజారు నాగరాజుకు ఆహ్వానం అందింది. కేంద్ర ప్రభుత్వం చేనేతకు ప్రోత్సాహం కల్పించేందుకు అమృత్ మహోత్సవంలో భాగంగా ధర్మవరం పట్టుచీరల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు నాగరాజు తెలిపారు. రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించే ఎక్స్‌పోలో పాల్గొనాలని తనను ఆహ్వానించారన్నారు.

# పారదర్శకతకు పాతరేనా?

స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకోవడానికి యువత సబ్సిడీ రుణాల కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తోంది. వివిధ కార్పొరేషన్ల కింద లోన్లు పొందడం కోసం వేల సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. అయితే లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకతకు పాతరేసి సిఫార్సులు ఉన్నవారికే లోన్లు దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. కూటమి పార్టీల నాయకులు పప్పు బెల్లాలు మాదిరి తలా ఇన్ని యూనిట్లు అని పంచుకుని.. అనుయాయులకు కట్టబెట్టేందుకు పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది.

- చక్రం తిప్పుతున్న కూటమి నేతలు
- సిఫార్సులకే కార్పొరేషన్ సబ్సిడీ రుణాలు!
- వేయికళ్లతో ఎదురుచూస్తున్న దరఖాస్తుదారులు



**జిల్లాలో వివిధ కార్పొరేషన్ల రుణాల వివరాలు**

| | |
|---|---|
| 2,297 | సబ్సిడీ రుణాల యూనిట్ల సంఖ్య |
| 22,943 | దరఖాస్తుల సంఖ్య |

**రాయదుర్గం:** ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూసి అలసిపోయిన యువత కనీసం స్వయం ఉపాధి రంగంలోనైనా స్థిరపడదామనుకుంటున్నారు. ఇందుకు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తుండగా వివిధ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలకు నోటిఫికేషన్ వెలువడింది. రూ.75 వేల నుంచి రూ.2 లక్షల వరకు రాయితీ వర్తించేలా ఆయా కార్పొరేషన్లు ప్రకటించాయి. అంతే అభ్యర్థుల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తాయి. మొత్తం 2,297 యూనిట్లకు 22,943 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో వచ్చాయి. ఇందులో బీసీ కార్పొరేషన్ ద్వారా 1,728 యూనిట్లకు 19,098, ఈబీసీ కింద 102 యూనిట్లకు 399, ఇక ఈడబ్ల్యూఎస్ పరిధిలో కమ్మ సామాజిక వర్గం వారికి 58 యూనిట్లకు 431, రెడ్డి సామాజిక వర్గం వారికి 29 యూనిట్లకు 339, వైశ్యుల్లో 21 యూనిట్లకు 338, బ్రాహ్మణుల్లో 14 యూనిట్లకు 81, క్షత్రియుల్లో 1 యూనిట్‌కు 0, కాపుల్లో 344 యూనిట్లకు 2,257 చొప్పున దరఖాస్తులు అందాయి. కులం, ఆదాయం, నేటివిటీ ధ్రువీకరణ పత్రాలు పొందడం నుంచి ఆన్‌లైన్ దరఖాస్తు వరకు ఒక్కో అభ్యర్థి రూ.500 నుంచి రూ.600 వెచ్చించారు.

**పైరవీలకే ప్రాధాన్యం!**

సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మండల స్థాయిలో ఎంపీడీఓ, బ్యాంకర్లు, మున్సిపాలిటీల్లో కమిషనర్, బ్యాంకర్ల సమక్షంలో ఫిబ్రవరి నెలలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో షాడో ఎమ్మెల్యేలుగా వ్యవహరిస్తున్న కొందరు కూటమి నేతలు సబ్సిడీ రుణాల మంజూరులో చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తోంది. తమ అనుయాయులకే ఆ రుణాలు ఇప్పించేందుకు పైరవీలు సాగిస్తున్నారు.

**స్వల్ప యూనిట్లతో న్యాయం జరిగేదెలా..?**

యువతకు స్వయం ఉపాధి కల్పిస్తున్నామంటున్న కూటమి సర్కార్.. అందుకు తగినట్టుగా కృషి చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలాల వారీగా జనాభాకు అనుగుణంగా రాయితీ రుణాలు కేటాయిస్తున్నట్లు ప్రకటించినా ఊరికి ఒక్కటి కూడా దక్కడం లేదు. జిల్లాలో ఏ మండలం, పట్టణం తీసుకున్నా 45 – 50 లోపే యూనిట్లు కేటాయించారు. దీన్నిబట్టిచూస్తే పదుల్లో యూనిట్లకు వేలల్లో దరఖాస్తులు వచ్చాయి. యూనిట్లు పెంచితే తప్ప అర్హులకు న్యాయం చేయలేని పరిస్థితి.

### పారదర్శకత పాటించాలి



అర్హత ఆధారంగానే సబ్సిడీ రుణాల ఎంపిక చేపట్టాలి. గత వైఎస్సార్‌సీపీ హయాంలో కులాలు, మతాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందాయి. కూటమి పాలనలో ఆ పరిస్థితులు కనిపించడం లేదు. సిఫార్సులు, రాజకీయ పలుకుబడి ఉన్నవారినే లబ్ధిదారులుగా ఎంపిక చేస్తే అర్హత కలిగిన వారికి అన్యాయం జరుగుతుంది. ఎంపిక విషయంలో అధికారులు పారదర్శకత పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– భోజరాజ్‌నాయక్, మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్, రాయదుర్గం

### అరటి నాణ్యతపై ఆరా



అరటి క్లీనింగ్, ప్యాకింగ్‌ను పరిశీలిస్తున్న ఇంగ్లండ్ ప్రతినిధి పాత్రిక్, ఉద్యానశాఖ జేడీ, డీడీ తదితరులు

**అనంతపురం అగ్రికల్చర్/ రాప్తాడు/ తాడిపత్రి రూరల్:** అరటి నాణ్యత పరిశీలనకు ఆదివారం జిల్లాకు వచ్చిన ఇంగ్లండ్‌కు చెందిన ఫెయిర్ ట్రాసా ఆర్గనైజేషన్ కంపెనీ ఫౌండర్ కమ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పాత్రిక్ స్ట్రబై వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. ఉద్యానశాఖ కమిషనరేట్ జేడీ డాక్టర్ దేవమునిరెడ్డి, జిల్లా డీడీ బీఎంపీ నరసింహారావు తదితరులతో కలిసి మొదట రాప్తాడు మండలం రామినేపల్లి వద్ద ఉన్న ఎలైట్ టిష్యూ కల్చర్ బనానా ల్యాబ్‌ను సందర్శించారు. అందులో ఉత్పత్తి అవుతున్న నాణ్యమైన రోగ రహితమైన టిష్యూకల్చర్ అరటి మొక్కల గురించి ల్యాబ్ ఎండీ రాఘవేంద్రను అడిగి తెలుసుకున్నారు. తర్వాత పుట్లూరు మండలం కడవకల్లు గ్రామంలో ఎస్కే బనానా కంపెనీ ఆధ్వర్యంలో తోటల నుంచి అరటి గెలలు సేకరిస్తున్న విధానం గురించి ఆరా తీశారు. అక్కడి నుంచి తాడిపత్రి మండలం చుక్కలూరులో కోల్డ్‌స్టోరేజీని సందర్శించారు, అక్కడే తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇంగ్లండ్ ప్రతినిధితో మాట్లాడారు. అరటి నాణ్యత, ఉత్పత్తి గురించి వివరించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారులు రత్నకుమార్, శైలజ, ఉమాదేవి, ఎస్కే బనానా కంపెనీ ప్రతినిధి నరసింహారెడ్డి, గ్రీన్ ట్రాఫిక్ కంపెనీ ప్రతినిధి రామోజీ, నోవా కంపెనీ ప్రతినిధి ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దూసుకొచ్చిన మృత్యువు

ప్రసవమైన నాలుగు నెలల తర్వాత పుట్టింట్లో ఒడిబియ్యం పెట్టించుకున్న ఆమె.. అక్కలను తోడుగా తీసుకుని అత్తారింటికి ఆటోలో బయల్దేరింది. చంటిబిడ్డను ముద్దాడుకుంటూ.. కబుర్లు చెప్పుకుంటూ సంతోషంగా వెళుతున్న సమయంలో రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. కూడేరు మండలం బ్రాహ్మణపల్లి – కమ్మూరు మధ్య ఆదివారం ఆటోను కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురు అక్కాచెల్లెళ్లు, నాలుగు నెలల చంటి పాప దుర్మరణం చెందారు. ఈ ఘటనతో మూడు కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.



మృతులు లీలావతి



యోగేశ్వరి



సరస్వతి (ఫైల్)



చంటిపాప

- రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం
- మృతుల్లో ముగ్గురు అక్కాచెల్లెళ్లు, ఒక చంటిపాప
- ఒడి బియ్యంతో మెట్టినింటికి వెళుతుండగా ఘటన



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ రాజు

**కూడేరు/ఉరవకొండ/గార్లదిన్నె:** గార్లదిన్నె మండలం మర్తాడుకు చెందిన జంగం పార్వతమ్మ, బసవరాజు (లేట్) దంపతులకు లీలావతి(45), పుష్పావతి, యోగేశ్వరి(40), సరస్వతి(37) సంతానం. పెద్ద కుమార్తె లీలావతికి కళ్యాణదుర్గం మండలం అప్పిలేపల్లికి చెందిన శ్రీకంఠంతో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు అచ్యుత్ కుమార్ ఉన్నాడు. మణికంఠ అనంతపురం శివారులోని వడియం పేట ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకుడిగా పని చేస్తూ అక్కడే జీవనం సాగిస్తున్నారు. రెండో కుమార్తె కుషావతికి వివాహమై మర్తాడులోనే ఉంటున్నారు. మూడో కుమార్తె యోగేశ్వరికి కళ్యాణదుర్గం మండలం పూలంపల్లికి చెందిన రుద్రేశ్వర్‌తో వివాహమైంది. వీరికి ఒక కూతురు ఉంది. యోగేశ్వరి ఇటీవల పుట్టింటికి వచ్చింది. ఇక చిన్న కుమార్తె సరస్వతికి ఉరవకొండ మండలం రాయంపల్లికి చెందిన సతీష్‌తో వివాహమైంది. ఈమె రెండో కాన్పు కోసం పుట్టింటికి వచ్చింది. పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. సరస్వతికి ఆదివారం మధ్యాహ్నం పుట్టింట్లో ఒడిబియ్యం పెట్టిన అనంతరం అత్తారింటిలో వదిలి పెట్టేందుకు అక్కలు లీలావతి, యోగేశ్వరి, లీలావతి కుమారుడు అచ్యుత్‌కుమార్‌తో కలిసి ఆటోలో మర్తాడు నుంచి కోటంక మీదుగా రాయంపల్లికి బయల్దేరారు. ఇదిలా ఉండగా.. కళ్యాణదుర్గం, అనంతపురానికి చెందిన తరుణ్, యశ్వంత్, రంజిత్, మరో ఇద్దరు యువతులు పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని కారులో అనంతపురం వస్తున్నారు. కూడేరు మండలం బ్రాహ్మణపల్లి – కమ్మూరు మధ్య మలుపు వద్ద కారు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ఆటోను వేగంగా ఢీకొంది. దీంతో ఆటో, కారు ముందు భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. ఆటోలో ఉన్న సరస్వతి తలకు, ముఖానికి బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. యోగేశ్వరి, లీలావతి, చంటి పాప, అచ్యుత్ కుమార్‌తో పాటు ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. కారులో ఎయిర్ బెలూన్స్ తెరుచుకోవడంతో అందులోని వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

**108కి సమాచారం ఇచ్చినా..**

ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు 108కు సమాచారం ఇచ్చినా అంబులెన్స్ సకాలంలో రాలేదు. కొద్దిసేపటి తర్వాత సీఐ రాజు తన సిబ్బందితో సంఘటన స్థలికి చేరుకుని క్షతగాత్రులను ప్రైవేటు వాహనాల్లో అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటి తర్వాత చంటి పాప, లీలావతి, యోగేశ్వరి మృతి చెందారు. అచ్యుత్ కుమార్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో స్థానికంగా ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మరణవార్త తెలియగానే ఆ ముగ్గురి కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రి వద్దకు చేరుకుని.. భగవంతుడా ఎంత పని చేశావయ్యా అంటూ కన్నీరు మున్నీరయ్యారు.

### నాన్నా.. అమ్మ ఎప్పుడొస్తుంది?



పెద్ద కుమార్తె జ్యోత్స్న

'నాన్నా.. అమ్మ ఎప్పుడొస్తుంది? నాకు లడ్డూ తెస్తోందా?' అంటూ సరస్వతి రెండేళ్ల కుమార్తె జ్యోత్స్న అమాయకపు మాటలు విన్న ప్రతి ఒక్కరి కళ్లల్లో నీళ్లు తిరిగాయి. మర్తాడు నుంచి ఒడిబియ్యం పోసుకుని తోబుట్టువులతో కలిసి రాయంపల్లిలోని మెట్టినింటికి వస్తున్న సరస్వతి రోడ్డు ప్రమాదంలో తన నాలుగు నెలల కూతురుతో పాటు మృతి చెందింది. వంటమాస్టర్ అయిన సతీష్ కాన్పు కోసం భార్య సరస్వతిని పుట్టింటికి పంపి.. పెద్ద కుమార్తె జ్యోత్స్నను తానే చూసుకునేవాడు. ఈ క్రమంలో ఆదివారం కుమార్తెను బంధువుల వద్ద ఉంచి కర్ణాటకలోని చేళ్లగురికిలో వంట పనికి వెళ్లాడు. ఇంటికి తిరిగొచ్చిన తర్వాత 'ఈరోజు మీ అమ్మ, బుజ్జి పాప వస్తారు. నీకు లడ్డూ కూడా తెస్తారు' అని కుమార్తెతో చెప్పాడు. అంతలోనే భార్య, చిన్నకుమార్తె మృతి చెందారన్న వార్తతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాడు. తన రెండేళ్ల కుమార్తె 'నాన్నా.. అమ్మ ఎక్కడ? నాకు లడ్డూ కావాలి' అంటూ అమాయకంగా అడగడంతో ఏం సమాధానం చెప్పాలో తెలియక సతీష్ కన్నీరు మున్నీరుగా విలపించాడు.

### సిద్ధేశ్వరా.. పాహిమాం



చిన్నరథాన్ని లాగుతున్న భక్తులు (ఇన్‌సెట్) అలంకరణలో సిద్ధేశ్వరుడి ఉత్సవ విగ్రహం

**అమరాపురం:** హేమావతిలో హెంజేరు సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం చిన్నరథోత్సవం కనుల పండువగా జరిగింది. ఉదయం స్వామివారికి సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని వివిధ రకాల వెండి ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి మహామంగళహారతి ఇచ్చారు. ఉత్సవ కమిటీ చైర్మన్ కరేగౌడ, ఈఓ నరసింహరాజు ఆధ్వర్యంలో సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం మేళ తాళాలతో ఉత్సవ విగ్రహాన్ని చిన్న రథం వద్దకు తీసుకొచ్చారు. ప్రత్యేక పూజల తర్వాత సిద్ధేశ్వరస్వామి మహారాజ్‌కు జై అంటూ భక్తులు అరటిపండ్లు, పూలు, బెల్లం, బొరుగులు, జిలకర్ర తదితర వాటిని రథంపైకి విసిరి మొక్కులు తీర్చుకున్నారు. చిన్నరథాన్ని ఆలయం నుంచి హంపన్నస్వామి గుడివరకు లాగారు. రాత్రి ముత్యాల పల్లకీలో స్వామివారిని పురవీధుల గుండా మేళతాళాలతో ఊరేగించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో ఆ ప్రాంతమంతా కిటకిటలాడింది.

**నేడు బ్రహ్మరథోత్సవం**

సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం 5 గంటలకు బ్రహ్మరథోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఈఓ నరసింహరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ కరేగౌడ తెలిపారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాటు చేశామన్నారు.

# నిరాటంకంగా దోపిడీ



సిలిండర్ డెలివరీపై అదనంగా వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో నార్పలలోని భారత్ గ్యాస్ ఏజెన్సీలో ఇన్‌చార్జ్ డీఎస్‌ఓ జగన్‌మోహన్ ఫిబ్రవరి 22న విచారణ నిర్వహించారు. ఆయన 17 మంది లబ్ధిదారులకు ఫోన్ చేయగా..నలుగురు ఫోన్ లిఫ్ట్ చేయలేదు. మిగిలిన 13 మందిలో 11 మంది తమ వద్ద నుంచి అదనంగా డబ్బు వసూలు చేశారని చెప్పారు. ఇద్దరు మాత్రం లేదని సమాధానం ఇచ్చారు. దీన్ని బట్టి చూస్తే సిలిండర్ ధరపై అదనంగా వసూలు చేస్తున్నారనేది వాస్తవం.

- గ్యాస్ డెలివరీ బాయ్స్ నిర్వాకం
- సిలిండర్‌పై అదనంగా రూ.30 వసూలు
- జిల్లాలో రోజూ 12 వేల సిలిండర్ల డెలివరీ
- ప్రతి నెలా అదనపు వసూళ్లు రూ.1.08 కోట్లు

| జిల్లాలో గ్యాస్ కనెక్షన్లు ఇలా | |
|---|---|
| మొత్తం కనెక్షన్లు | 7,65,246 |
| దీపం పథకం | 2,14,970 |
| పీఎం ఉజ్వల యోజన | 30,355 |
| సీఎస్ఆర్ | 37,257 |
| సాధారణ కనెక్షన్లు | 4,82,664 |
| రోజువారీ సిలిండర్ల డెలివరీ | 12,000 |

**అనంతపురం అర్బన్:** వంటగ్యాస్ వినియోగదారుల నుంచి డెలివరీబాయ్స్ అదనపు రుసుము వసూలు చేస్తున్నారు. సిలిండర్ నికర ధరపై అదనంగా డబ్బు వసూలు చేయరాదు. డెలివరీ బాయ్స్ మాత్రం ఇవన్నీ పట్టించుకోవడం లేదు. కంపెనీల నుంచి తగిన పైకం వస్తున్నప్పటికీ వినియోగదారుల నుంచి అక్రమంగా సరాసరి రూ.30 దాకా వసూలు చేస్తూనే ఉన్నారు. ఈ మొత్తం చూసేందుకు చిన్నదిగానే కనిపిస్తుంది. కానీ జిల్లావ్యాప్తంగా రోజువారీగా డెలివరీ అవుతున్న సిలిండర్లపై అదనపు వసూలు మొత్తం చూస్తే ఔరా అనక తప్పదు. జిల్లా వ్యాప్తంగా 50 గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. వీటి పరిధిలో 7,65,246 గృహావసర వంట గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. రోజువారీగా దాదాపు 12 వేల సిలిండర్లు డెలివరీ అవుతున్నాయి. ఒక్కొక్క సిలిండర్ నుంచి అదనంగా రూ.30 చొప్పున రోజుకు 3.60 లక్షలుగా నెలసరి రూ.1.08 కోట్లు అదనపు సొమ్ము వసూలు జరగుతోందంటే 'కనెక్షన్ల' డెలివరీలో వారి 'కలెక్షన్' ఎంత 'స్ట్రాంగ్' అనేది స్పష్టమవుతోంది.

**అదనపు బాదుడే బాదుడు..**

గృహావసర వంట గ్యాస్ సిలిండర్ ధర ప్రస్తుతం రూ.870 ఉంది. అయితే సిలిండర్ నికర ధరతో సంబంధం లేకుండా బిల్లుపై వినియోగదారుల నుంచి డెలివరీ బాయ్స్ రూ.30 అదనంగా వసూలు చేస్తున్నారు. కొందరి వద్ద నుంచి రూ.50 వరకు వసూలు చేస్తున్న సందర్భాలూ లేకపోలేదు. డెలివరీ బాయ్స్ అడిగినంత ఇవ్వకపోతే వినియోగదారులకు తిప్పలు తప్పడం లేదు. సిలిండర్ మంజూరైనా డెలివరీ చేయరు. 'డోర్ లాక్' అని చెప్పి ఏజెన్సీకి సిలిండర్‌ను వెనక్కిచ్చేస్తారు. ఇలా చేయడం వల్ల సిలిండర్ బుకింగ్ రద్దవుతుంది. దీంతో మరోమారు వినియోగదారు బుక్ చేయాలి. ఇలా రెండు మూడు దఫాలు ఇబ్బందికి గురిచేస్తారు. దీంతో ఈ తిప్పలు పడలేక వినియోగదారులు తప్పని పరిస్థితిలో సిలిండర్‌పై వారు అడిగిన అదనపు మొత్తాన్ని సమర్పించుకోవాల్సి వస్తోంది.

### అదనంగా వసూలు చేస్తే చర్యలు



నిబంధనల ప్రకారం సిలిండర్ నికర ధరపై అదనంగా వసూలు చేయకూడదు. ఇప్పటికే ఈ విషయంపై ఏజెన్సీల నిర్వాహకులకు స్పష్టమైన ఆదేశాలిచ్చాం. అధికారులను ఏజెన్సీలకు పంపించి తనిఖీ చేయిస్తున్నాం. అదనంగా వసూలు చేస్తున్న బాయ్స్‌పైన, సంబంధిత ఏజెన్సీపైనా చర్యలు తీసుకుంటాం. సిలిండర్ డెలివరీ క్రమంలో బాయ్స్ అదనంగా డబ్బులు వసూలుపై వినియోదారులు ఫిర్యాదు చేయాలి.

– శివ్ నారాయణ్ శర్మ, జాయింట్ కలెక్టర్

## క్లుప్తంగా

### జూదరుల అరెస్ట్

**తాడిపత్రి రూరల్:** మండలంలోని చుక్కలూరు సమీపంలో పేకాట ఆడుతున్న 10 మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.60 వేలు నగదు, 10 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శివగంగాధరరెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు పట్టణ, రూరల్ ఎస్ఐలు గౌస్, ధరణీబాబులు సిబ్బందితో కలసి ఆదివారం తనిఖీలు చేపట్టి జూదరులను అరెస్ట్ చేసినట్లు వివరించారు.

### పట్టపగలే ఎలుగుబంటి సంచారం



జాతీయ రహదారిని దాటుతున్న ఎలుగుబంటి

**రాయదుర్గం టౌన్:** స్థానిక గ్యాస్ గోదాము ప్రాంతంలోని కురాకుల గుట్ట వద్ద పట్టపగలే ఎలుగుబంటి సంచారంతో కాలనీ వాసులు బెంబేలెత్తిపోయారు. ఆదివారం సాయంత్రం ఓ ఎలుగుబంటి కురాకులగుట్ట వైపు నుంచి జాతీయ రహదారి బ్రిడ్జిని దాటింది. రోడ్డుపై వెళుతున్న ఎలుగుబంటిని కొందరు తమ సెల్‌ఫోన్లలో వీడియో తీసి వైరల్ చేశారు. రెండు రోజులుగా ఈ ప్రాంతంలో ఎలుగుబంటి సంచరిస్తున్నట్లు కాలనీవాసులు చెబుతున్నారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పందించి ఎలుగుబంటిని బంధించాలని స్థానికులు కోరుతున్నారు.

### తొలి పూజలందుకున్న పోతలయ్య స్వామి



అలంకరణలో పోతలయ్య స్వామి మూలవిరాట్

**కనగానపల్లి:** మండలంలోని దాదులూరు గ్రామంలో పోతలయ్య స్వామి జాతర ఆదివారం భక్తుల కోలాహలం మధ్య ప్రారంభమైంది. తొలి రోజు వేకువజామునే గంతిమర్రి, కలికివాండ్లపల్లి గ్రామాల నుంచి భక్తులు ఎలవగంపలో స్వామి ఆభరణాలు, పూలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆలయంలో విశేష పూజల అనంతరం మూలవిరాట్‌ను ఆభరణాలతో అలంకరించారు. అలాగే చెన్నకేశవస్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు చేసి స్వామి కాపులు దాసంగాలు (పంక్తి భోజనాలు) నిర్వహించారు.

**నేడు జ్యోతుల మహోత్సవం:** జాతరలో భాగంగా సోమవారం పోతలయ్య స్వామికి జ్యోతుల మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. కీలకమైన గావుల మహోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

# విద్యుత్ శాఖలో డిప్యుటేషన్ల లీల

- కొన్నేళ్లుగా నగరంలోనే తిష్ట
- 50 మందికి పైగా ఉద్యోగులు వివిధ సెక్షన్లలో పాగా
- రూరల్ ప్రాంతాలను వేధిస్తున్న ఉద్యోగుల కొరత

శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం విద్యుత్ డివిజన్ పరిధిలోని చెన్నేకొత్తపల్లి సెక్షన్‌లో పనిచేస్తున్న సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ డిప్యుటేషన్‌పై అనంతపురం నగరంలోని బళ్లారి రోడ్డులో ఉన్న డీ5 సెక్షన్‌లో నాలుగు నెలలుగా పనిచేస్తున్నారు. ఇందుకు గాను అప్పట్లో అనంతపురం విద్యుత్ సర్కిల్‌లో పనిచేసిన ఓ ఎస్ఈని అన్ని విధాలుగా సంతృప్తి పరిచి ప్రసన్నం చేసుకున్నట్లుగా ఆరోపణలున్నాయి. ఈ కారణంగానే నిబంధనలకు విరుద్ధంగా ఆయనకు ఆగమేఘాలపై అనంతపురం జిల్లాకు డిప్యుటేషన్ ఆర్డర్ ఇచ్చేసినట్లుగా సొంత శాఖలోని ఉద్యోగులే చెబుతున్నారు. ఫలితంగా చెన్నేకొత్తపల్లి సెక్షన్‌లో ఎస్ఎల్ఐ కొరత వేధిస్తూ ఉంది.

గుత్తి విద్యుత్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న ఓ లైన్‌మెన్, కళ్యాణదుర్గం డివిజన్‌లో పనిచేస్తున్న ఓ లైన్ ఇన్‌స్పెక్టర్, పుట్టపర్తిలో పనిచేస్తున్న ఓ ఫోర్‌మెన్ డిప్యుటేషన్‌పై నగరంలోకి వచ్చి దాదాపు 6 ఏళ్లు గడుస్తోంది. ఏటా ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకుంటూ అనంతపురం నగరంలోని వివిధ సెక్షన్లలో వారు కొనసాగుతుండడం గమనార్హం.



**అనంతపురం టౌన్:** విద్యుత్ శాఖ అధికార యంత్రాంగం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోంది. ఉద్యోగులకు అనాధికారికంగా డిప్యుటేషన్లు ఇస్తూ వారికి అనుకూలంగా ఉన్న ఉద్యోగులను నగరంలోకి తీసుకువచ్చేస్తున్నారు. ఈ క్రమంలో గ్రామీణ ప్రాంతాలను విద్యుత్ ఉద్యోగుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకున్న జిల్లా వ్యాప్తంగా 50మందికి పైగా క్షేత్రస్థాయి ఉద్యోగులు.. నిబంధనలకు విరుద్ధంగా డిప్యుటేషన్‌పై అనంతపురంలోని వివిధ సెక్షన్లలో కొనసాగుతున్నారు. వీటితోపాటు సర్కిల్ కార్యాలయంలోనూ పదుల సంఖ్యలో ఉద్యోగులను అంతర్ జిల్లాల డిప్యుటేషన్లపై అనంతపురానికి రప్పించుకున్నారంటే ఉన్నతాధికారులు ఏ స్థాయిలో పైరవీలు సాగించారో అర్థమవుతోంది.

**వేధిస్తున్న ఉద్యోగుల కొరత..**

విద్యుత్ శాఖలో అక్రమ డిప్యుటేషన్ల కారణంగా రూరల్ ప్రాంతాల్లో క్షేత్రస్థాయి విద్యుత్ ఉద్యోగుల కొరత తీవ్రంగా ఉంది. ప్రస్తుతం వేసవి కాలం ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా విద్యుత్ సమస్యలు అధికంగా వేసవిలోనే ఉత్పన్నమవుతుంటాయి. ఇంతటి కీలకమైన సమయంలోనూ అధికారులు అక్కడ పోస్టులను భర్తీ చేయకుండా అనధికారికంగా డిప్యుటేషన్లను ఇచ్చేస్తూ ఉద్యోగులు కోరుకున్న ప్రాంతాలకు పంపించేస్తున్నారు. అనంతపురం నగర పరిధిలో ఆరు విద్యుత్ సెక్షన్లు ఉన్నాయి. వీటన్నింటిలోనూ దాదాపు 25 మందికి పైగా లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు, ఫోరుమెన్లు, జూనియర్ లైన్‌మెన్లు డిప్యుటేషన్‌పై కొనసాగుతుండడం గమనార్హం. అక్రమ డిప్యుటేషన్ల అంశంలో ఉన్నతాధికారుల తీరుపై కొందరు ఉద్యోగులు బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు.

**రద్దు చేస్తాం**



విద్యుత్ శాఖలో డిప్యుటేషన్ అనే విధానమే లేదు. అయితే దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులకు వైద్యుల సూచన మేరకు డిప్యుటేషన్ ఇచ్చేందుకు అవకాశం ఉంది. డిప్యుటేషన్లపై పదుల సంఖ్యలో నగరంలో తిష్ట వేసిన ఉద్యోగులపై విచారణ చేపట్టి వారి డిప్యుటేషన్లను రద్దు చేస్తాం. వారిని పాత స్థానాల్లోకి వెళ్లేలా రెండు మూడు రోజుల్లో చర్యలు తీసుకుంటాం.

– శేషాద్రి శేఖర్, విద్యుత్‌శాఖ ఎస్ఈ, అనంతపురం

### బీజేపీ నేతల బాహాబాహీ



వాదులాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్, బీజేవైఎం నేత సురేష్

**ఉరవకొండ:** జిల్లా బీజేపీ నేతల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. అందరి సమక్షంలోనే నువ్వెంత అంటే నువ్వెంత అంటూ ఒకరిపై ఒకరు మాటల యుద్ధానికి దిగారు. ఒకానొక దశలో పరిస్థితి ఉద్రిక్తతకు దారి తీసి కొట్టుకునే స్థాయికి వెళ్లింది. వివరాలు.. పీఎం విశ్వకర్మ కింద ఎంపికైన లబ్ధిదారులకు ఉరవకొండలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఏర్పాటు చేశారు. శిక్షణా కేంద్రం పర్యవేక్షణ బాధ్యతలను బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కట్టుబడి సురేష్ తీసుకోగా, తనిఖీ చేయడానికి ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్‌తో పాటు ముఖ్యనేతలూ వచ్చారు. ఈ సందర్భంగా వారికి శిక్షణలో తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను లబ్ధిదారులు వివరించారు. దీనిపై రాజేష్ మాట్లాడుతూ.. కనీస వసతులు కల్పించలేదని, నాణ్యమైన భోజనం కూడా అందించకపోతే ఎలా అంటూ నిర్వాహకులను నిలదీశారు. అక్కడే ఉన్న సురేష్ వెంటనే వాగ్వాదానికి దిగడంతో ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. ఒకరినొకరు కొట్టుకునే పరిస్థితి నెలకొనడంతో కొందరు బీజేపీ నేతలు కల్పించుకుని ఇరువర్గాలను పక్కకు తీసుకెళ్లారు. ఘటనపై పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేయనున్నట్లు రాజేష్ తెలిపారు.

# చంద్రబాబు నిజ స్వరూపం ఇదే

- పేదల సంక్షేమానికి ఎగనామం పెట్టనున్నారు
- వైఎస్సార్‌సీపీ శ్రేణులే లక్ష్యంగా కుట్ర
- ఇందులో భాగంగానే ప్రజలను ధిక్కరించి మాట్లాడుతున్నారు
- రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

**అనంతపురం ఎడ్యుకేషన్:** 'పేదలపై సీఎం చంద్రబాబుకు ఉన్న వైఖరి మరోసారి బయటపడింది. ఆయన నిజస్వరూపం ఇదే' అంటూ రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భయం, పక్షపాతం లేకుండా, రాగద్వేషాలకు అతీతంగా ప్రజలందరికీ న్యాయం చేస్తానని శాసనసభ్యుడిగా ప్రమాణం చేసిన చంద్రబాబు... ఈ రోజు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు, కార్యకర్తలకు ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కాని ఎలాంటి పనులు చేయబోమంటూ తెగేసి చెపుతుండడం దుర్మార్గమన్నారు. ఇప్పటి వరకూ ప్రజలతో ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు ఎంతో కొంత జవాబుదారీతనంతో వ్యవహరిస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు ప్రయత్నాలు చేశారన్నారు. అయితే ప్రజలతో కాకుండా జనసేన, బీజేపీ, ఈవీఎంలతో పొత్తు పెట్టుకుని గెలిచిన చంద్రబాబుకు ప్రజలంటే లెక్కలేని తనమని, అందుకే ప్రజలను ధిక్కరించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఉద్యోగాల కల్పన, నిరుద్యోగ భృతి అందక 9 నెలలుగా నిరుద్యోగులు నానా పాట్లు పడుతున్నా ప్రభుత్వంలో కనీస స్పందన కూడా లేదన్నారు. 18 ఏళ్లు నిండిన అక్కచెల్లెమ్మలకు ప్రతి నెలా రూ.1,500 ఇస్తామని చెప్పి ఒక్క రూపాయి కూడా ఇచ్చిన పాపాన పోలేదన్నారు. డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు రూ. 10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తామని, 50 ఏళ్లు దాటిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పింఛన్లు ఇస్తామని చెప్పి బడ్జెట్‌లో రూపాయి కూడా కేటాయించలేదన్నారు. కులం, మతం, పార్టీలను ఏనాడూ జగనన్న చూడలేదన్నారు. కేవలం పేదరికం ప్రామాణికంగా చేసుకుని అందరికీ సంక్షేమ ఫలాలు అందజేశారన్నారు. జగన్ అప్పులు చేస్తున్నారని, రాష్ట్రాన్ని మరో శ్రీలంకగా మారుస్తున్నారంటూ నాడు మొసలి కన్నీరు కార్చిన చంద్రబాబు ప్రస్తుతం చేస్తున్నదేమిటో చెప్పాలన్నారు. 2023–24లో జగనన్న రూ.79 వేల కోట్లు అప్పులు తెస్తే.. 2024–25కు గాను రూ.98వేల కోట్ల అప్పులు తీసుకురావాలని చెప్పి రూ.1.31 లక్షల కోట్ల అప్పులను చంద్రబాబు తీసుకువచ్చారని తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.1.14 లక్షల కోట్లు అప్పులు తీసుకురావాలని చెప్పి రూ.1.50 లక్షల కోట్లు తెస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రజల నెత్తిన అప్పుల భారం మోపి సంక్షేమ పథకాలకు ఎగనామం పెడుతున్నారని ధ్వజమెత్తారు. తల్లికి వందనం పథకానికి రూ. 12 వేల కోట్లు అవసరం కాగా రూ. 9,400 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారని, అన్నదాత సుఖీభవకు రూ. 12 వేల కోట్లు అవసరం కాగా రూ. 6,300 కోట్లు మాత్రమే కేటాయించారు. అరకొర నిధుల కేటాయింపులు చూస్తుంటే సగానికి పైగా లబ్ధిదారులను మోసం చేసే కుట్ర బహిర్గతమవుతోందన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలెవరూ కూటమి ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూడడం లేదన్నారు. తామంతా జగనన్న వెంటే ఉంటామని, జనంతోనే ఉంటామని, కాదూకూడదని జైల్లో పెట్టినా సంతోషంగా అక్కడే ఉంటామన్నారు. ఈ నిరంకుశ పాలనకు త్వరలో చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో మీనుగ నాగరాజు, ఆత్మకూరు వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్, నవీన్ పాల్గొన్నారు.

### దొంగకు దేహశుద్ధి

**తాడిపత్రి రూరల్ :** మండలంలోని గంగాదేవిపల్లిలో ఆదివారం పట్టుబడిన దొంగ రాజును స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. యాడికి గ్రామానికి చెందిన రాజు గంగాదేవిపల్లిలోని ఓబుళమ్మ ఇంట్లో దొంగతనం చేస్తూ పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా ఇంటి యజమాని కేకలు వేయడంతో గ్రామస్తులు వెంటాడి పట్టుకున్నారు. నిందితుడిని అదుపులోకి పోలీసులు తీసుకుని విచారణ చేపట్టారు.

### ముగిసిన బుగ్గరామలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాలు



ఏకాంతోత్సవంలో శివపార్వతుల ఉత్సవ మూర్తులు

**తాడిపత్రి రూరల్:** స్థానిక బుగ్గరామలింగేశ్వర స్వామి బ్రహోత్సవాలు ఆదివారం చండీ హోమం, ఏకాంతోత్సవంతో వైభవంగా ముగిశాయి. పదిరోజుల పాటు జరిగిన బ్రహ్మోత్సవాల్లో ఆదిదంపతులు వివిధ వాహన సేవల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ముగింపు రోజు ఉదయం ఆలయంలో విశేష అభిషేకాలు పెద్ద ఎత్తున సాగాయి. పార్వతీదేవి ఆలయంలో కుంకుమార్చన చేశారు. అనంతరం చండీ హోమం నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఏకాంతోత్సవం నేత్రపర్వంగా సాగింది.

### బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో రాయదుర్గానికి చోటు



సర్టిఫికెట్‌ను అందజేస్తున్న దృశ్యం



లలితా నామ సహస్ర పారాయణం చేస్తున్న దృశ్యం

**రాయదుర్గంటౌన్:** నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో రాయదుర్గానికి చోటు దక్కింది. శ్రీకళారాధన భరతనాట్య డ్యాన్స్ అకాడమీ 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం చిందనూరు కళ్యాణమంటపం వేదికగా సామూహిక లలితా సహస్ర నామ పారాయణం నిర్వహించారు. దాదాపు 200 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ మొత్తం ప్రక్రియను చెన్నై నుంచి విచ్చేసిన నోబెల్ బుక్ ఆఫ్ రికార్డు ప్రతినిధులు ప్రదీప్, హేమంత్ నాగరాజు రికార్డు చేశారు. 32 నిమిషాల 47 సెకన్లలో లలితా సహస్ర పారాయణాన్ని పఠించడం అంతర్జాతీయస్థాయిలో మొదటి సారి కావడం విశేషం. ఆధ్యాత్మిక గురువు, విప్రమలై లక్ష్మీనరసింహ స్వామి ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తిస్వామిజీ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి డ్యాన్స్ అకాడమీ టీచర్ జ్యోతి నగేష్, శ్వేతాపద్మని నేతృత్వం వహించారు. కో–ఆర్డినేటర్‌గా ఆల్ ఇండియా రేడియో అనౌన్సర్ లంకా ప్రసాద్ వ్యవహరించారు. కార్యక్రమం అనంతరం నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్‌ను నిర్వాహకులకు ప్రతినిధులు అందజేశారు. ముఖ్య అతిథులుగా మెట్టు యశోదమ్మ, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి హాజరయ్యారు.

# ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

- ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ

**ధర్మవరం:** ప్రభుత్వ ఉద్యోగులంతా ఐకమత్యంతో ఉన్నప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని సీఎస్‌బీ గార్డెన్స్‌లో ఆదివారం ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రథమ కౌన్సిల్ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలకు, ప్రజలకు అనుకూలంగా విధులను బాధ్యతగా నిర్వర్తిస్తున్నామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ ఉద్యోగులు ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. పీఆర్‌సీపై ప్రభుత్వం తక్షణం జుడీషియల్ పే కమిషన్ ఏర్పాటు చేయాలని, ఇప్పటికే ఆలస్యమైన దృష్ట్యా ఐఆర్ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. సరెండర్ లీవులు, జీపీఎఫ్ లోన్ల ఆర్థిక ప్రయోజనాలను తక్షణమే చెల్లించాలన్నారు. ఇప్పటికే మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో ఉన్న ఎఫ్ఆర్‌సీ, పదోన్నతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. మూడు దశాబ్దాలుగా ఉన్న ఉపాధ్యాయుల ఏకీకృత సమస్యను తక్షణమే పరిష్కార మార్గం చూపాలని కోరారు. పదవీ విరమణ వయస్సు మినిమం టైం స్కేల్ ఉద్యోగులకు వర్తింపచేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల పక్షాన నిలబడే ఏకైక సంఘం ప్రభుత్వ ఉద్యోగుల సంఘమన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రామంజనేయులు యాదవ్, సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పఠాన్ బాజీ, గ్రామ సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రజాక్, ఆర్టీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కేదార్‌నాథ్, ఐక్యవేదిక కోచైర్మన్ కరణం హరికృష్ణ, ఏపీజీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి, పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆత్మరెడ్డి, ఎంటీఎస్, ఎస్ఎంఆర్ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్, వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

# మానసిక వైద్యం గ్రామీణులకూ అందాలి

- మానసిక వైద్యుల సంఘం జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ సవితా మల్హోత్రా





డాక్టర్ యండ్లూరి ప్రభాకర్‌ను సన్మానిస్తున్న డాక్టర్ సవితా మల్హోత్రా, విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ పద్మా సుధాకర్

**అనంతపురం మెడికల్:** గ్రామీణ ప్రాంత ప్రజలకూ మానసిక వైద్యం అందేలా చూడాలని, ఆ దిశగా యువ వైద్యులు అడుగు వేయాలని మానసిక వైద్యుల సంఘం జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ సవితా మల్హోత్రా పేర్కొన్నారు. రెండ్రోజులుగా అనంతపురం నగర శివారులోని ఓ కన్వెన్షన్ హాల్లో జరుగుతున్న జాతీయ స్థాయి మానసిక వైద్యుల నిరంతర వైద్య విద్యా సదస్సు ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా డాక్టర్ సవితా మల్హోత్రా మాట్లాడుతూ... చిన్నపాటి దగ్గు, జ్వరానికే గ్రామాల నుంచి ప్రజలు ఆస్పత్రులకు రావాలంటే సమయం తీసుకునే పరిస్థితి నెలకొని ఉందన్నారు. ఇలాంటి తరుణంలో మానసిక జబ్బుల తీవ్రతను వారు గుర్తించలేకపోతున్నారన్నారు. మానసిక జబ్బులపై గ్రామీణులను చైతన్య పరచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం సదస్సుకు పెద్ద ఎత్తున వైద్యులు హాజరుకావడానికి కృషి చేసిన జిల్లా సైకియాట్రిక్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ యండ్లూరి ప్రభాకర్‌ను ఆమె అభినందించారు. యండ్లూరి ప్రభాకర్‌తో పాటు సీనియర్ వైద్యులను సన్మానించారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా పి.శైలజ హాజరు కాగా, మానసిక వైద్య నిపుణులు డాక్టర్ టీపీ సుధాకర్, డాక్టర్ రమణరావు, డాక్టర్ జగదీష్, డాక్టర్ రఘురాం, డాక్టర్ వికాస్ మీనన్, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ లోకేశ్వర రెడ్డి, డాక్టర్ శరత్‌చంద్ర, డాక్టర్ రాధికారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సెంట్రల్ వర్సిటీలో ఫీజులు నియంత్రించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

**బుక్కరాయసముద్రం:** రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా అనంతపురంలో ఏర్పాటైన సెంట్రల్ యూనివర్సిటీలో ఫీజుల నియంత్రించాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ డిమాండ్ చేశారు. సిద్దరాంపురం రోడ్డు సమీపంలో ఉన్న ఆర్డీటీ బధిరుల పాఠశాలలో అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీ 3వ మహాసభ ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ మాజీ కార్యదర్శి జార్జ్ హాజరై, మాట్లాడారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు అవుతున్నా ఇప్పటికీ సెంట్రల్ యూనివర్సిటీలో పూర్తిస్థాయి తరగతి గదులు, అమ్మాయిల వసతి భవనాలు ఏర్పాటు కాలేదన్నారు. వర్సిటీలో విద్యార్థినులకు రక్షణ కరువైందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీలో ఫీజులు పెంచాడం దుర్మార్గమన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు.

**సెంట్రల్ యూనివర్శిటీ విద్యార్థి సంఘం ఎన్నిక..**

సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి సంఘాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ సమక్షంలో 21 మందితో కమిటీను ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడిగా అన్నా అనస్, కార్యదర్శిగా సూర్యవంశీ కృష్ణతో పాటు 21 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పరమేష్, కార్యదర్శి ఓతూర్, జిల్లా బాలికల విభాగం కన్వీనర్ రజిత, ఉపాధ్యక్షుడు గిరి, నాయకులు భీమేష్, సోము, సాయి, జీనత్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రశ్నపత్రాల లీకేజీలో 14 మంది నిందితులు!

- ఎస్కేయూ దూరవిద్య విభాగానికి సంబంధించి 2011లో ప్రశ్నపత్రాల లీకేజీ
- సీఐడీ కోర్టులో కేసు విచారణ ప్రారంభం
- 42 మంది సాక్షులను విచారించనున్న న్యాయస్థానం



**అనంతపురం:** శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం దూరవిద్య విభాగానికి సంబంధించిన ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారం మరో దఫా తెరమీదకు వచ్చింది. ఈ కేసు విచారణ సీఐడీ కోర్టుకు రావడంతో ప్రస్తుతం చర్చనీయాంశమైంది. వివరాలు... 2011, నవంబర్‌లో ఉమ్మడి రాష్ట్ర వ్యాప్తంగా ఎస్కేయూ దూరవిద్య విభాగంలో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, పరీక్షలు నిర్వహించారు. అప్పట్లో దూరవిద్య విభాగం డైరెక్టర్‌గా ప్రొఫెసర్ పసల సుధాకర్ ఉండేవారు. 32 వేల మంది విద్యార్థులు పరీక్షలకు దరఖాస్తు చేసుకోగా, మొత్తం 56 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే ప్రకాశం జిల్లా పొదిలి పొరుగున ఉన్న అధ్యయన కేంద్రం నిర్వాహకులు పరీక్ష కేంద్రం కావాలని అప్పట్లో పట్టుబట్టారు. ఈ అభ్యర్థనను దూరవిద్యా కేంద్రం అధికారులు తిరస్కరిస్తూ పొదిలి కేంద్రంలో పరీక్షలు జరిగేలా ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలోనే 2011, నవంబర్ 23న జరగాల్సిన పరీక్షకు సంబంధించిన ప్రశ్న పత్రం అదే నెల 22న బయటకు వచ్చింది. కొన్ని ప్రశ్న పత్రాలు ముందు రోజే తీసి ఉద్దేశ్యపూర్వకంగా లీక్ చేశారు. ఇలా మొత్తం 21 ప్రశ్న పత్రాలు లీక్ అయ్యాయి. వీటిని లీక్ చేసిన వారు నేరుగా వీసీ కార్యాలయానికి ఫ్యాక్స్ చేయడం గమనార్హం. అప్పటికే 2011, నవంబర్ 11న నూతన వీసీగా బాధ్యతలు స్వీకరించిన ఆచార్య రామకృష్ణారెడ్డి ఈ అంశాన్ని ప్రతిష్టాత్మకంగా స్వీకరించారు. అప్పటి రిజిస్ట్రార్ రవీంద్ర ఫిర్యాదు మేరకు ఇటుకలపల్లి పీఎస్‌లోనూ కేసు నమోదైంది. అనంతరం ఈ కేసు దర్యాప్తును సీబీసీఐడీకి అప్పగించారు. విచారణ పూర్తి కావడంతో సీఐడీ కోర్టులో చార్జీషీట్ దాఖలైంది. ప్రస్తుతం సీఐడీ కోర్టులో ఈ కేసు విచారణ సాగుతోంది. మొత్తం 14 మందిని నిందితులుగా పేర్కొన్నారు. 42 మంది సాక్షులను చేర్చారు. కాగా, దూరవిద్య విభాగంలో పనిచేస్తున్న సింహభాగం అధికారులు ఉద్యోగ విరమణ పొందారు. అప్పటి డైరెక్టర్ ప్రొఫెసర్ పి.సుధాకర్ దివంగతులయ్యారు.

### నీటికుంటలో పడి చిన్నారి మృతి

**తాడిపత్రి రూరల్:** మండలంలోని చుక్కలూరు సమీపంలోని నల్లబండల యూనిట్‌కు చెందిన నీటి కుంటలో పడి మూడేళ్ల చిన్నారి మృతిచెందాడు. వివరాలు... పామిడికి చెందిన గంగారాజు, తన కుటుంబసభ్యులతో కలసి బండల పాలీసు యూనిట్‌లో పనిచేస్తున్న చెల్లెలు ఇంటికి ఇటీవల వచ్చాడు. ఈ నేపథ్యంలో యూనిట్ వద్ద ఇన్‌ఫిల్‌ట్రేషన్ గుంత వద్ద ఆడుకుంటున్న గంగరాజు కుమారుడు గౌతమ్‌నందా (3) ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. ఆలస్యంగా విషయాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు గుంతలో పడిన చిన్నారిని వెలికి తీసి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు నిర్ధారించారు.

## క్లుప్తంగా

### గొర్రెల మందపైకి దూసుకెళ్లిన కారు

- 5 గొర్రెల మృతి, కాపరికి గాయాలు



మృతి చెందిన గొర్రెలు

చెన్నేకొత్తపల్లి: ఎన్ఎస్ గేట్ సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం గొర్రెల మందపైకి ఓ కారు దూసుకెళ్లడంతో ఐదు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. రామగిరి మండలానికి చెందిన గొర్రెల కాపరి గంగాధర్ ఆదివారం గొర్రెలను మేతకు తీసుకెళ్లాడు. ఎన్ఎస్ గేట్ సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై గొర్రెల మంద రోడ్డు దాటుతుండగా.. వేగంగా వచ్చిన కారు అదుపుతప్పి గొర్రెల మందపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 5 గొర్రెలు మృతి చెందగా.. గొర్రెల కాపరి గంగాధర్ స్వల్పంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తికి చెన్నేకొత్తపల్లి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



నీలకంఠారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, పార్టీ నాయకులు

కనగానపల్లి: మండలంలోని గుంతపల్లి గ్రామంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నీలకంఠారెడ్డి (60) అనారోగ్యంతో మృతి చెందాడు. వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన అనంతపురంలోని ఒక ప్రవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడు. అయితే ఆరోగ్యం కుదుటపడక ఇంటి వద్ద మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న రాప్తాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, పార్టీ మండల నాయకులతో కలసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నీలకంఠారెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

### 31 వరకూ డిస్కౌంట్ విక్రయాలు



లేపాక్షి ఎంపోరియంలో హస్తకళల ప్రదర్శన ఏర్పాటు చేసిన దృశ్యం

అనంతపురం కల్చరల్: సనాతన భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను చాటే హస్తకళాకారులను ఆదరించాలని లేపాక్షి ఎంపోరియం సిబ్బంది కోరారు. రంజాన్, ఉగాది పర్వదినాలను పురస్కరించుకుని హస్తకళాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా నగరంలోని లేపాక్షి ఎంపోరియంలో ఈనెల 31 వరకూ డిస్కౌంట్ అమ్మకాలు, ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సంప్రదాయ చేనేత వస్తువుల అమ్మకాలు ప్రదర్శన, మన సంస్కృతిని చాటే కళా ఉత్పత్తుల్లో ఎంపిక చేసిన వాటిపై 50 శాతం వరకు డిస్కౌంటు ధరలకే విక్రయాలు ఉంటాయని పేర్కొన్నారు. కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, లెదర్ పప్పెట్స్, కలంకారి, ఎంబ్రాయిడరీ వస్తువులు అందుబాటులో ఉంచామన్నారు. హస్తకళా ఉత్పత్తులను ఆదిరించే విధంగా డిస్కౌంట్ సేల్స్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపోరియం ఇన్‌చార్జ్ అమర్‌నాథ్, కాటమయ్య, సురేష్, నాగార్జున, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

### సుబ్రహ్మణ్యేశ్వరుడికి పంచామృతాభిషేకాలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజా కార్యక్రమాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. తొలుత స్వామిని పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆకుపూజ, పల్లకీసేవ, కుజదోష కాలసర్పదోష నివారణకు మూల మంత్ర బీజాక్షర హోమం నిర్వహించారు. అనంతరం ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతీ దేవిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. మహా మంగళహారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# వీడని ప్లాస్టిక్ భూతం

- నగరంలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ విక్రయాలు
- నియంత్రణకు చర్యలు శూన్యం
- చోద్యం చూస్తున్న నగరపాలక సంస్థ అధికారులు



అరవింద నగర్‌లోని శివాలయం ముందు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లలో టెంకాయలు అమ్ముతున్న దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: నగరాన్ని ప్లాస్టిక్ భూతం వీడటం లేదు. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం.. నగరపాలక సంస్థ ప్రజారోగ్యాధికారుల బాధ్యతారాహిత్యంతో నగరంలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ అమ్మకాలు జరుగుతున్నాయి. కూటమి ప్రజాప్రతినిధులు, నగరపాలక సంస్థ అధికారులు ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటామని చెబుతున్నా.. అది మాటలకే పరిమితమవుతోంది. కమలానగర్, పాతూరులో కొందరు సేట్ల వ్యాపారులతో నగరపాలక సంస్థ ప్రజారోగ్యాధికారి కుమ్మక్కయ్యారన్న వార్తలు వినిపిస్తున్నాయి. ప్రతి నెలా మామూళ్లతో ప్లాస్టిక్ విక్రయాలపై అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేకపోతున్నారని సాక్షాత్తు నగరపాలక సంస్థలో చర్చించుకోవడం విశేషం.

**తూతూమంత్రంగా దాడులు..**

ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు బళ్లారి, తదితర ప్రాంతాలకు అనంతపురం నుంచే ప్లాస్టిక్ సరఫరా అవుతోంది. అందుకు జిల్లా కేంద్రంలోని పాతూరు, కమలానగర్ కేంద్ర బిందువుగా నిలుస్తున్నాయి. ఒక్క పాతూరు, కమలానగర్‌లోనే పదుల సంఖ్యలో గోడౌన్లు ఉన్నాయి. వీటి ద్వారా నిషేధిత ప్లాస్టిక్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వ్యాపారం రూ.లక్షల్లో జరుగుతోంది. కొందరు సేట్ల యజమానులు ప్లాస్టిక్‌ను అమ్ముతున్నా.. కూటమి ప్రభుత్వం అండదండలు, అధికారుల ఆశీస్సులు ఉండటంతో ప్రజారోగ్యాధికారులు తూతూమంత్రంగా దాడులు నిర్వహిస్తున్నారు. నగరంలోని ప్రధాన బేకరీలు, హోటళ్లు, రెస్టారెంట్లు, కొన్ని స్టార్ హోటళ్లలో సైతం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం జోరుగా సాగుతోంది. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లో వేడి పదార్థాలు వేస్తే.. ప్లాస్టిక్ కరిగి అందులో వచ్చే రసాయనాలు కేన్సర్‌కు కారకంగా మారుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. కానీ ప్రజారోగ్యాన్ని ఏమాత్రం లెక్క చేయడం లేదు. రూ.కోట్లలో ప్లాస్టిక్ వ్యాపారం జరుగుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి అదనపు కమిషనర్ రమణారెడ్డి, అప్పటి కార్యదర్శి సంగం శ్రీనివాసులు, తదితరులు ప్లాస్టిక్‌పై ఉక్కుపాదం మోపారు. కమలానగర్‌లోని సేట్ల షాపుల్లో రూ.లక్షలు విలువ చేసే ప్లాస్టిక్‌ను సీజ్ చేశారు. కానీ అప్పట్లో కొందరు బీజేపీ నాయకులు నగరపాలక సంస్థలో షో చేశారు. సేట్ల జోలికి వస్తే గుడ్డలు ఊడదీసి కొడతామంటూ అప్పటి అధికారులను బహిరంగంగా హెచ్చరించారు. కానీ ఉన్నతాధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని ప్లాస్టిక్ వినియోగించే వారికంటే.. వాటిని విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటే భవిష్యత్తులో పర్యావరణానికి మేలు చేసిన వారవుతారని నగరవాసులు చెబుతున్నారు.

**చెత్త నిర్వహణలోనూ విఫలం..**

నగరపాలక సంస్థ ప్రజారోగ్యాధికారి డాక్టర్ విష్ణుమూర్తి, ఎన్విరాన్‌మెంట్ డీఈ నరసింహలు ఆయారాం.. గయారాం అవతారం ఎత్తారు. రోజూ కాసేపు చెత్తను తరలించడం.. ఆపై పత్తా లేకుండా పోతున్నారు. చెత్త నిర్వహణలోనూ ఎంహెచ్‌ఓ, డీఈ నిర్లక్ష్యంగా ఉన్నారు. ఇక పారిశుధ్య కార్యదర్శులు అటువైపు తొంగి చూడటం లేదు. జాబ్‌చార్ట్ ఆధారంగా ఉదయం విధులకు గైర్హాజరవుతున్నారు. ఇటీవల కమిషనర్ బాలస్వామి తనిఖీలోనూ కొందరు పారిశుధ్య కార్యదర్శుల వైఫల్యం స్పష్టంగా కనిపించింది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ప్రత్యేక చొరవ తీసుకుని ప్లాస్టిక్ భూతాన్ని అంతమొందించేందుకు చర్యలు తీసుకుంటారో లేదో చూడాలి.

**కఠిన చర్యలు తీసుకుంటాం**



నిషేధిత ప్లాస్టిక్‌పై స్పెషల్ డ్రైవ్ చేపట్టాల్సిన అవసరం ఉంది. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఎన్విరాన్‌మెంట్ డీఈ ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్లాలి. అన్నీ ఎంహెచ్‌ఓ చూడాలంటే ఎలా? వాస్తవంగా ఎన్విరాన్‌మెంట్ డీఈ నరసింహ క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదు. ఆయన కాస్త పట్టించుకోవాలి. నిషేధిత ప్లాస్టిక్ దొరికితే సీజ్ చేయాలి. మొదటి సారి దొరికితే రూ.25 వేలు జరిమానా, రెండోసారి దొరికితే రూ.50 వేలు జరిమానా విధించాలి. మూడో సారి దొరికితే ఆ షాపును సీజ్ చేసేలా చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ విష్ణుమూర్తి, ఎంహెచ్‌ఓ, నగరపాలక సంస్థ

### విద్యుత్ చార్జీల పెంపు దారుణం




మాట్లాడుతున్న ఐక్య సంఘాల ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: రాష్ట్రం ప్రభుత్వం సామాన్యులు భరించలేనంతగా విద్యుత్ చార్జీలు పెంచడం దారుణమని పలువురు వక్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాతూరు వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఆదివారం ఏపీ పట్టణ పౌర సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో 'విద్యుత్ చార్జీల మోత-స్మార్ట్ మీటర్లు' అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. సీనియర్ న్యాయవాది రసూల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్వాన్ విశ్వం విజ్ఞానకేంద్రం ప్రతినిధి రాజమోహన్, మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకుడు చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ ప్రతినిధి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఫోరం రాష్ట్ర కార్యకర్త ఎంవీ ఆంజనేయులు, కాంగ్రెస్ నాయకుడు దాదా గాంధీ తదితరులు మాట్లాడారు. విద్యుత్ చార్జీలు పెంచడం లేదంటూనే ప్రతినెల అంచనాలకు మించి విద్యుత్ బిల్లులు వస్తుండటంతో విచారం వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్ల విషయం మరింత బాధాకరమని అవే పూర్తిగా వచ్చిననాడు సెల్‌ఫోన్ రీచార్జీలాగా ఎప్పుడు కరెంటు ఉండదో తెలియదన్నారు. రానున్న రోజుల్లో విద్యుత్ బిల్లులు మరింత పెరగడం ఖాయమన్నారు. సంక్షేమాన్ని పట్టించుకోని ప్రభుత్వం పెనుభారం ఎలా మోపుతుందని ప్రశ్నించారు. విద్యుత్ చార్జీలు ఇలాగే పెంచితే మరో విద్యుత్ ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

### భక్తిశ్రద్ధలతో సహస్ర లింగార్చన



శివలింగాలకు పూజలు చేస్తున్న మహిళలు

అనంతపురం కల్చరల్: మహాశివుడి సైకత లింగాల నిమజ్జనం ఆదివారం సందడిగా సాగింది. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని శివబాలయోగి ఆశ్రమంలో జిల్లాలోనే తొలిసారి సహస్ర లింగార్చన, లక్ష లింగార్చన పెద్ద ఎత్తున జరిగింది. గత మూడు రోజులుగా నిత్యపూజలందుకున్న 1,30,000 లింగాలను చెరువుకట్ట సమీపంలోని శాస్త్రోక్తంగా నిమజ్జనం చేశారు. తొలుత ఆలయం నుంచి లింగాలను తలపై పెట్టుకుని చెరువుకట్ట వరకు వెళ్లిన ఆశ్రమ ప్రతినిధులు, భక్తబృందాలు అక్కడ గంగమ్మ తల్లికి చీరసారె సమర్పించారు. ఒడిబియ్యం పెట్టి శివలింగాలను గంగమ్మ ఒడికి పంపించారు. ఓం నమః శివాయ అంటూ దారి పొడుగునా నామస్మరణ చేశారు. అనంతరం తీర్థప్రసాద వినియోగం పెద్ద ఎత్తున జరిగింది. కార్యక్రమంలో ఆశ్రమ ట్రస్టు అధ్యక్షుడు జూటూరు అరవిందు, ఉపాధ్యక్షులు రత్నగిరి దేవరాజ్, కార్యదర్శి సురేష్, చెన్నకేశవ, విశ్వనాథం పాల్గొన్నారు.

## కాంట్రాక్టర్ల లబ్ధి కోసమే లైనింగ్ పనులు



రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: ప్రజలు మీ మాటలు నమ్మి మీకు ఓట్లు వేసి గెలిపించిన పాపానికి అనంత రైతులకు అన్యాయం చేస్తున్నారు. కుప్పానికి నీరు తీసుకెళ్లేందుకు అనంత రైతులను కన్నీరు పెట్టిస్తారా అని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిపై మండిపడ్డారు. ఆదివారం తోపుదుర్తి గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. హంద్రీ-నీవా కాలువ లైనింగ్ పనులను ఆపాలని పార్టీలకు అతీతంగా రైతులు ముందుకు వస్తున్నారని తెలిపారు. లైనింగ్ పనుల్లో భాగంగా కాలువకు కాంక్రీట్ వేస్తే కాలువ పక్కన దాదాపు 20 కిలోమీటర్ల వరకూ భూగర్భ జలాలు అడుగంటి పోయి రైతులు ఇబ్బందులు పడుతారని పేర్కొన్నారు. బోర్లు ఎండిపోయి రైతులు వలస వెళ్లే పరిస్థితి ఏర్పడుతుందని స్పష్టం చేశారు. లైనింగ్ పనులను అడ్డుకునేందుకు ఏ పార్టీ వారు వచ్చినా కలుపుకుని పోరాటాలు చేస్తామన్నారు. రైతులకు ఇంకా పంటలు పండించుకునేందుకు శ్రీశైలం డ్యాంలో 80 టీఎంసీల నీరు ఉందని.. ఇంకా దాదాపు ఐదు నెలల పాటు వాడుకోవచ్చని పేర్కొన్నారు. రైతులు లైనింగ్ పనులు వద్దూ అంటుంటే ఎమ్మెల్యే పరిటాల సునీత మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. లైనింగ్ పనులపై నోరు మెదపడం లేదని తెలిపారు. రైతులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోమన్నారు. లైనింగ్ పనులు జరిగితే పనులు ఆపే మొదటి వ్యక్తి తానే అవుతానని పేర్కొన్నారు. అన్ని రాజకీయ పార్టీలతో కలసి పాదయాత్ర చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## రైతు సమస్యల పరిష్కారానికే పాదయాత్ర



రాప్తాడులో పోస్టర్లు విడుదల చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

రాప్తాడు: రైతులు సాగు చేసిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు 2024–25 ఖరీఫ్, రబీ సీజన్లలో పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని సీఐటీయూ ఉపాధ్యక్షుడు టి.రామాంజనేయులు డిమాండ్ చేశారు. రైతు సమస్యల పరిష్కారం కోసం ఈనెల 7వ తేదీన ఉరవకొండ నుంచి చేపట్టనున్న పాదయాత్రను జయప్రదం చేయాలని కోరారు. ఆదివారం మండల కేంద్రంలో పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 2024–25 ఖరీఫ్, రబీలో సాగు చేసిన మిరప, పత్తి, సీడ్ జొన్న, పప్పుశనగ పంటలకు గిట్టుబాటు ధర కల్పించక పోవడంతో రైతులు అప్పుల పాలయ్యారన్నారు.మిరప పంటకు క్వింటా రూ.50 వేలతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధర రూ.11,780 రైతులకు గిట్టుబాటు అయ్యే పరిస్థితి లేదన్నారు. సీడ్స్, జొన్న రైతులకు గిట్టుబాటు ధర కల్పించి దళారుల నుంచి రైతులను కాపాడాలని సూచించారు. పాదయాత్ర ఈనెల 10వ తేదీన అనంతపురంలోని కలెక్టరేట్ వద్దకు చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి పోతులయ్య, నాయకులు సుబ్బిరెడ్డి, పోతులయ్య, హరీష్, రామిరెడ్డి, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఫ్రూట్ కవర్లతో మామిడి కాయలకు రక్షణ



మాట్లాడుతున్న డాక్టర్ రామసుబ్బయ్య

పామిడి: కాయదశలో ఉన్న మామిడికి ఫ్రూట్ కవర్లు ధరింపజేయడం వల్ల రసంపీల్చే పురుగులు, ఈగలు ఆశించకుండా నివారించవచ్చని పుట్టపర్తి ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ సైంటిస్టు డాక్టర్ రామసుబ్బయ్య సూచించారు. ఆదివారం పామిడిలో దళిత రైతులు సాగుచేస్తున్న మామిడి తోటలను ఆయనతో పాటు హార్టికల్చర్ ఆఫీసర్ జీ మిత్రవింద మాధవి పరిశీలించారు. పూతదశలోని మామిడికాయపై రసంపీల్చే పురుగు ఆశించి ఉండడాన్ని ఆయన గమనించారు. ఈ సందర్భంగా ఆయన మామిడి సాగుపై రైతుల శిక్షణ అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. లీటర్ నీటికి 1.5 గ్రాముల హస్పేట్ (లేదా) 0.4 మిల్లీలీటర్ల కాన్ఫిడార్ కలిపి పైరుపై పిచికారి చేయడం వల్ల రసంపీల్చే పురుగులను ఆశించకుండా నివారించవచ్చన్నారు. అలాగే కాయదశలో ఫ్రూట్ కవర్లు ధరింపజేయడం వల్ల రసంపీల్చే పరుగులు, ఈగలు ఆశించకుండా నివారించవచ్చన్నారు. తద్వారా రైతన్నలు నాణ్యమైన కాయలు పొందవచ్చునన్నారు. పూతదశలో సక్రమంగా మొక్కకు నీటిని అందించాలన్నారు. మామిడిలో సమగ్ర సస్య రక్షణ యాజమాన్య పద్ధతులను పాటించడం వల్ల అధిక దిగుబడి సాధ్యమన్నారు. ఉద్యానవన, వ్యవసాయాధికారులు, పాల్గొన్నారు.

## రంజాన్ దీక్షలు ప్రారంభం



దువా చేస్తున్న మౌలానా

పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు నగరంలోని అన్ని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. తెల్లవారుజామున నుంచే ఉపవాసాలను ప్రారంభించిన ముస్లింలు.. సాయంత్రం ఇఫ్తార్‌తో ఉపవాస దీక్ష ముగించారు. ఇషా నమాజు అనంతరం తరావీ నమాజులో మత పెద్దలు ఖురాన్ పఠనం చేయించి రంజాన్ విశిష్టతను తెలియజేశారు. దానికితోడు తొలిరోజే దస్తగిరి స్వామి జయంతి రావడంతో పలుచోట్ల ఆయన బోధనలను గుర్తు చేసుకున్నారు. నగరంలోని పాతూరు జామియా మసీదు, పురాతన జంగాలపల్లి మసీదు, ఆరో రోడ్డు పీటీసీ ఎదురుగా ఉన్న చాందినీ మసీదు, సప్తగిరి సర్కిల్ ఈద్గా మసీదు, రెండో రోడ్డు బావుద్దీన్ మసీదు తదితర చోట్ల సాయంత్రం ప్రార్థనలకు అశేషంగా తరలివచ్చిన వారితో రహదారులు కిటకిటలాడాయి. పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల ముస్లిం నాయకులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. – అనంతపురం కల్చరల్:



తరావీ నమాజులో పాల్గొన్న ముస్లింలు

## శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి



మాట్లాడుతున్న సమగ్రశిక్ష ఏపీసీ శైలజ

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాల్సిన ఆవశ్యకత ఉందని సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ (ఏపీసీ) శైలజ సూచించారు. ఆదివారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుల ఫోరం, సీకే దాస్ అకాడమీ సంయుక్తంగా సైన్స్ సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా సమగ్రశిక్ష ఏపీసీ శైలజ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో శాస్త్రీయ వైఖరులను పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. నిత్య జీవితంలో ప్రతి అంశాన్ని శాస్త్రీయ కోణంలో చూడటం పిల్లలకు నేర్పించాలని సూచించారు. హెల్త్ కేర్ కన్సల్టెంట్ డాక్టర్ పంచాగ్నుల మురళీధర్ 'సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర' అనే అంశాన్ని వివరించారు. ఎన్ఐటీ వరంగల్ రిటైర్డ్ ఆచార్యుడు రామచంద్రయ్య మాట్లాడుతూ.. విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం పెంచడమే కాకుండా వారిని మానవతావాదులుగా తయారు చేయాలన్నారు. నేషనల్ జియో ఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ నుంచి డాక్టర్ ప్రదీప్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పర్యావరణ స్పృహ కలిగి ఉండాలన్నారు. నేల, నీరు వాటి స్వభావాన్ని అర్థం చేసుకుంటూ.. సంరక్షణకు పాటుపడాలని తెలిపారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన సహజ వనరులను అందించాలన్నారు. కార్యక్రమంలో డీఈసీబీ కార్యదర్శి గంధం శ్రీనివాసులు, ఎస్‌జీసీ ప్రాంతీయ సమన్వయకర్త ఆనందభాస్కర్ రెడ్డి, ఫిజికల్ సైన్స్ ఫోరం ప్రతినిధులు మధుసూదనరెడ్డి, వెంకట రంగయ్య, మదన్ మోహన్ రెడ్డి, రామచంద్ర, ఓబుళరెడ్డి, రాము, సదాశివయ్య, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సంక్షేమాన్ని పట్టించుకోని ప్రభుత్వం




మాట్లాడుతున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున

రాప్తాడురూరల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి తొమ్మిది నెలలవుతున్నా కేంద్రానికి ఊడిగం చేయడం తప్ప ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోలేదని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున మండిపడ్డారు. ప్రజా సమస్యలపై రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 4న అనంతపురం ఆర్డీఓ కార్యాలయం ఎదుట చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి పంచాయతీ ఇంద్రజిత్ గుప్తా నగర్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున, రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. ఎన్నికల హామీల్లో భాగంగా గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇంటి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే అన్నదాత సుఖీభవ కింద వ్యవసాయానికి సంబంధించి నేటికీ ఒక రూపాయి జమ కాలేదని వాపోయారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పి పట్టించుకోలేదన్నారు. తల్లికి వందనం కింద ఒక్కొక్కరికి రూ.15 వేలు ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. నిరుద్యోగులకు ప్రతినెలా రూ. 3 వేలు భృతి ఇస్తామన్న ప్రభుత్వం గాలిలో లెక్కలు వేస్తోందని ఎద్దేవా చేశారు. దీపం పథకం అర్హులకు అందలేదన్నారు. 4న తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అనంతపురం రూరల్ మండల కార్యదర్శి మేకల రమేష్, సహాయ కార్యదర్శి నరేష్, నాయకులు అక్కలన్న, విజయ్, కుళ్లాయప్ప, ప్రభాకర్, నాయుడు, బసిరెడ్డి, సల్మాన్, ముత్యాలు, చౌడమ్మ, సుధామణి పాల్గొన్నారు.

## కారును ఢీకొన్న ద్విచక్ర వాహనం



గాయపడిన రాజు

రాప్తాడురూరల్: ముందు వెళ్తున్న కారును వెనుక నుంచి ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ ఘటన ఆదివారం అనంతపురం రూరల్ మండలం సిండికేట్ నగర్ వద్ద చోటు చేసుకుంది. నెల్లూరు జిల్లాకు చెందిన రాజశేఖర్ తన కుటుంబంతో వలస వచ్చి రాచానపల్లిలో నివాసం ఉంటున్నాడు. బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఉదయం అనంతపురం నగరం నుంచి రాచానపల్లికి బైకులో వెళ్తున్నాడు. సిండికేట్ నగర్ దాటిన తర్వాత ముందు వెళ్తున్న కారు స్పీడ్‌బ్రేకర్ల కారణంగా కాస్తా నెమ్మదించింది. వెనుక నుంచి బైకులో స్పీడుగా వస్తున్న రాజు అదుపు చేసుకోలేక కారును బలంగా ఢీ కొట్టాడు. కిందకు పడిపోయి స్పృహ కోల్పోయాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు నాగేంద్ర, దేవ ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. క్షతగాత్రుడిని వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.